RNI NO.APTEL/2013/49614

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సర్క్యులేట్ కాలడుతూ ఆంధ్రప్రజలందరి మన్ననలను పొందుతున్న రాజనీతి దినపత్రికకు జిల్లా వ్యాప్తంగా విలేకరులు కావలెను.

ఇతర వివరాలకు వెంటనే సంప్రదించండి:

కాకర్ల పద్మజ చీఫ్ ఎడిటర్

మొబైల్: 9618501530

శ్రీమతి కాకర్ల పద్మజ ప్రధాన సంపాదకత్వంలో

# రాజనీతి

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 13 | సంచిక : 176 | అన్నమయ్య జిల్లా | చీఫ్ ఎడిటర్ : కాకర్ల పద్మజ | బుధవారం 08 జూలై 2026 | పేజీలు : 04 | వెల : రూ. 2/-

## ఎల్‌జీ ప్రతినిధులతో లోకేష్ భేటీ




సియోల్, జులై 7: దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్యా, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈఓ ల్యూ జే చెయోల్, ఎల్‌జీ ఇండియా సీఈఓ హాంగ్ జు జియోన్‌లతో సియోల్‌లోని ఎల్‌జీ ట్విన్ టవర్స్‌లో విడివిడిగా సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల విస్తరణకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. నోయిడా, బెంగళూరులో ఉన్న ఎల్‌జీ ప్రాజెక్టులను విస్తరించే క్రమంలో విశాఖపట్నంలో ఒక ఇంజినీరింగ్ కేంద్రం లేదా గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. శ్రీసిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో డిస్‌ప్లే మాడ్యూల్స్, సెన్సార్లు, పవర్ ఎలక్ట్రానిక్స్ వంటి విడిభాగాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఎల్‌జీ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఐఓటీ (×శీ), రోబోటిక్స్ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాల్లో పరిశోధన, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని.. ఈ రంగాల్లో ఆర్‌టీజీఎస్ (=+ూ) తో కలిసి ఇన్నోవేషన్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎల్‌జీ సహకరించాలని లోకేష్ కోరారు. ఈ ప్రాజెక్టులు అమల్లోకి వస్తే రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని మంత్రి వివరించారు. రాష్ట్రంలో పారదర్శక పారిశ్రామిక విధానాలు, మెరుగైన మౌలిక వసతులు ఉన్నాయని, పరిశ్రమలకు అన్ని విధాలా సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఎల్‌జీ సంస్థతో జరిగిన ఈ భేటీ ద్వారా పెట్టుబడుల విస్తరణపై సానుకూల చర్చలు జరిగాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

**–సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి**



జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు, పెన్షన్, హైపవవర్ కమిటీ, మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటుతో పాటు ఇతర జర్నలిస్టుల సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామని సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి హామీ యిచ్చారు. జర్నలిస్టుల సమస్యల పై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) ప్రతినిధివర్గం ఈరోజు సచివాలయంలో మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి4న విజయవాడలో జరిగిన జర్నలిస్టుల మహాప్రదర్శనలో మంత్రి ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ పరిష్కరించిన హామీల విషయంలో కృతజ్ఞతలు తెలిపింది. మిగతా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసింది. దానిని శ్రద్ధగా చదివి నోట్ చేసుకున్న మంత్రి పార్థసారధి గౌరవ ముఖ్యమంత్రితో చర్చించి అతిత్వరలోనే మీ డిమాండ్లను అమలు చేసేలా కృషి చేస్తానని అన్నారు. మంత్రిని కలిసిన ప్రతినిధివర్గంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు కలిమిశ్రీ, ఆంధ్రప్రదేశ్ చిన్న, మధ్యతరహా దినపత్రికలు, పీరియాడికల్స్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు ఖాన్, స్టేట్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.డి. ఆనంద్ వున్నారు.

## ఆలయ పర్యాటకంతో హస్తకళల అభివృద్ధి: ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్




విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం (ఆలయ పర్యాటకం) రూపంలో హస్తకళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆర్ట్ ఫోరమ్‌లో ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (లేపాక్షి) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ హస్తకళల పండుగ 2026' ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ప్రతి హస్తకళాఖండంపై ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. దీని ద్వారా కళను సృష్టించిన కళాకారుడి పేరు, అతని శ్రమ, ఆ కళ వెనుక ఉన్న కథ ప్రపంచానికి తెలుస్తుందని పేర్కొన్నారు. ఉప్పాడ స్టాల్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం, తన భార్య శ్రీమతి అన్నా కొణిదెల కోసం మూడు ఉప్పాడ జందానీ పట్టుచీరలను కొనుగోలు చేశారు. అలాగే తిరుపతి కళాకారుల నుండి శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని, అరటి నారతో చేసిన హ్యాండ్‌బ్యాగ్‌ను కొన్నారు. కాకినాడ కళాకారులు ప్రదర్శించిన రామాయణంలోని 'రావణ వధ' తోలుబొమ్మలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. రాబోయే గోదావరి పుష్కరాలలో ఈ కళ వైభవాన్ని చాటేలా ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. నరసాపురం లేస్ ఆర్టిస్టులు, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న కండరాలు, ఎముకలు, శ్వాసకోశ సమస్యలపై స్పందిస్తూ, క్లస్టర్ల వారీగా నిరంతరం మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హస్తకళల ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త మార్కెటింగ్ కల్పించేందుకు గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో లభించే లేపాక్షి ఈ-కామర్స్ యాప్‌ను ఆయన ప్రారంభించారు. 'వి.బి. జీ రామ్ జీ' పథకం కింద క్లస్టర్లలో మరియు ఏజెన్సీ ప్రాంతాల్లో సవర కళాకారుల కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. ఏలూరు కార్పెట్, అనంతపురం అరటి నార కళాకారుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించారు. అలాగే గుంటూరు, కాకినాడలలో ఆధునీకరించిన లేపాక్షి షోరూమ్‌లను, రాజమహేంద్రవరం విమానాశ్రయంలోని కొత్త షోరూమ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీమతి ఎస్. సవిత, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), లేపాక్షి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏఐజీ ఆసుపత్రికి మాజీ సీఎం కేసీఆర్




హైదరాబాద్ (జులై 07) :మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రికి వచ్చారు. కేటీఆర్ కుమారుడు హిమాన్ష కు గాయాలు కావడంతో ఆయన ఏఐజీ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. నిన్న రాత్రి వర్క్ అవుట్ చేస్తుండగా హిమాన్షు ముక్కుకు గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే హిమాన్షును ఏఐజీ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వైద్య చికిత్స చేయించారు. హిమాన్షుకు గాయాలు కావడంతో...అయితే ప్రస్తుతం హిమాన్షు కోలుకుంటున్నాడని ఏఐజీ వైద్యులు తెలిపారు. అయితే మనవడికి గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేరడంతో పరామర్శించేందుకు ఆసుపత్రికి వచ్చారు. ఏఐజీ ఆసుపత్రికి చేరుకున్న హిమాన్షుకు తగిన గాయాలు, చికిత్స జరుగుతున్న తీరుపై వైద్యులను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ తో పాటు మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావు కూడా ఉన్నారు.

## విజయవాడ నుంచి వారణాసి, కోల్‌కతా నగరాలకు సరికొత్త ఇండిగో విమాన సర్వీసులు!



విజయవాడ: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికులకు ఇండిగో ఎయిర్‌లైన్స్ శుభవార్త చెప్పింది. ఆగస్టు 13, 2026 నుండి విజయవాడను ఆధ్యాత్మిక నగరమైన వారణాసి, చారిత్రక నగరమైన కోల్‌కతాతో అనుసంధానిస్తూ సరికొత్త విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఇండిగో ప్రతినిధులు ప్రకటించారు. దీనికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తన విజయవాడ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కొత్త విమాన సర్వీసులు వారంలో నిర్ణీత రోజులలో (మంగళ, గురు, శనివారాల్లో) అందుబాటులో ఉంటాయి. ఈ ప్రత్యక్ష సర్వీసులు ప్రయాణికుల సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, రాష్ట్ర పర్యాటక, వ్యాపార రంగాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని మంత్రి కందుల దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ - వారణాసి - కోల్‌కతా (ఫ్లైట్ నం. **6E 6502**): సాయంత్రం 6:20 గంటలకు విజయవాడలో బయలుదేరి, రాత్రి 8:15 గంటలకు వారణాసి చేరుకుంటుంది. అక్కడి నుండి బయలుదేరి రాత్రి 10:15 గంటలకు కోల్‌కతా చేరుకుంటుంది. కోల్‌కతా - వారణాసి - విజయవాడ (ఫ్లైట్ నం. **6E 6501**): మధ్యాహ్నం 2:10 గంటలకు కోల్‌కతాలో బయలుదేరి, మధ్యాహ్నం 3:55 గంటలకు వారణాసి గుండా ప్రయాణిస్తూ, సాయంత్రం 5:50 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో ఏపీ సేల్స్ మేనేజర్ మోహిత్ కృష్ణ, విజయవాడ అసిస్టెంట్ మేనేజర్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాల ఆవేదన కలచివేస్తోంది: మంత్రి అచ్చెన్నాయుడు



అమరావ తి, జులై 7: విశాఖ పట్నం తీరంలో మత్స్యకార పడవ గల్లంతై నలుగురు (4 రోజులుగా) ఆరు గురు మత్స్యకారులు కనిపించకుండా పోయిన ఘటనపై రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాల వేదన తనను ఎంతగానో కలచివేసిందని, ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కోసం భారత కోస్ట్ గార్డ్, నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, మరియు విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సంయుక్తంగా గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అభిషేక్ కిషోర్‌ను మంత్రి ఆదేశించారు. మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని, బాధిత కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## పదోన్నతి పొందిన డీడీ, డిపిఆర్వో లకు ఆత్మీయ వీడ్కోలు, సన్మానం



కడప, జూలై 7 : కాకినాడ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన పద్మజ, అన్నమయ్య జిల్లా డీపిఆర్వోగా పదోన్నతిపై వెళుతున్న సునీల్ సాగర్ లకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక కాలెక్టరేట్ ప్రాంగణంలోని సమాచార పౌరసబంధాల శాఖ కార్యాలయంలో.. డీఐపిఆర్వోగా పనిచేసి పదోన్నతిపై డిడిగా కాకినాడ జిల్లాకు వెళ్తున్న బి. పద్మజకు, అలాగే ఇక్కడ డీఎల్ పిఆర్వోగా పనిచేస్తూ డిపిఆర్వోగా పదోన్నతి పొంది మదనపల్లె వెళుతున్న సునీల్ సాగర్ లకు.. ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా ఆత్మీయ వీడుకోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్చాలు అందించి దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ సందర్భంగా.. పలువురు అధికారులు, సిబ్బంది వారి మనోభావాలను వ్యక్తం చేస్తూ పదోన్నతి పొందిన వారితో విధి నిర్వహణలో వారితో ఎదురైన అనుభవాలు, అనుబంధాన్ని అందరితో పంచుకున్నారు. ఎలాంటి విమర్శలు, వివాదాలకు తావు లేకుండా.. శాఖాధిపతిగా డీఐ పిఆర్వో పద్మజ, డివిజనల్ పిఆర్వోగా సునీల్ సాగర్ లు వారి విధుల్లో చేసిన అమూల్యమైన సేవలను కొనియాడారు. పదోన్నతిపై వెళుతున్న ప్రాంతాల్లో కూడా వారు అత్యున్నత సేవలను అందించి అందరి ఆదరాభిమానాలు చురగొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీడీ పద్మజ మాట్లాడుతూ.. కడప కార్యాలయంలో విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. మీ అందరి సహకారం, సమన్వయంతో ఇంతకాలం.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన అధికార విధులను నిర్వర్తించగలిగానన్నారు. ప్రతి అధికారికి బదిలీ అనేది సర్వ సాధారణమే అయినా.. ఒక సంవత్సర కాలం పాటు ఈ కార్యాలయంలో అందరితో కలిసి పనిచేసిన అనుభవం ఒక కుటుంబ వాతావరణాన్ని తలపించిందన్నారు. ఈ ప్రాంత వాతావరణం, ఇక్కడి మీడియా మిత్రుల అభిమానం, అధికారులు సిబ్బంది సమన్వయ సహకారం.. తనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. డిపిఆర్వో సునీల్ సాగర్ మాట్లాడుతూ.. కడప సమాచార శాఖ కార్యాలయంలో అందరూ బాధ్యతాయుతంగా పనిచేసే వారేనన్నారు. అందరూ కలిసికట్టుగా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తూ డిపార్ట్మెంట్ కు మంచి పేరు తీసుకురావాలన్నారు. సర్వీసులో ఉన్న ప్రతి ఒక్కరికీ బదిలీలు సర్వ సాధారణం అయినప్పటికీ.. అత్యుత్తమ సేవలు అనేవి వారి పదోన్నతులకు సహకరిస్తాయని, ఆ దిశగా సిబ్బంది పారదర్శకంగా సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఇఇఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా, ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, కృపాకర్, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, టీఏ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు



## జీవో 396 వెంటనే రద్దు చేయాలి దస్తావేజు రచయితల ఆందోళన ఉధృతం.. అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన



మదనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు రచయితలు, వారి సహాయకులు ఆందోళనను ఉధృతం చేశారు. గత ఆరు రోజులుగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారు, మంగళవారం కార్యాలయం ముందు బైఠాయించి అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ జీవో అమలుతో రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు రచయితల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న వేలాది మంది దస్తావేజు రచయితలు, వారి సహాయకుల కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదంలో పడ్డాయని పేర్కొన్నారు. ఈ వృత్తిపై ఆధారపడిన కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవో 396ను వెంటనే ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడంతో పాటు అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీవోను రద్దు చేసి దస్తావేజు రచయితల జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖర్ల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కంగేరి నంద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు రాజేంద్ర, ఇమ్రాన్ భాష, కుళ్లాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి.. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

**-మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్న జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**



రాయచోటి / టి.సుండుపల్లి: అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా (గ్రూజ 2671) విధులు నిర్వహిస్తున్న గండి వెంకటేశ్వర్లు (46) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం కన్నుమూశారు. 2011 బ్యాచ్‌కు చెందిన ఆయన గత 15 ఏళ్లుగా కడప, అన్నమయ్య జిల్లాల్లో అత్యంత క్రమశిక్షణతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు అకాల మరణంపై అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారు తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఒక సమర్థుడైన పోలీస్ సిబ్బందిని కోల్పోవడం పోలీస్ శాఖకు తీరని లోటని, బాధిత కుటుంబానికి డిపార్ట్‌మెంట్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎస్పీ గారి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు మృతుని నివాసానికి చేరుకుని భౌతిక కాయానికి నివాళులర్పించారు. దహన సంస్కారాల తక్షణ ఖర్చుల నిమిత్తం ఎస్పీ గారి తరపున రూ. 1,00,000/- (లక్ష రూపాయల) నగదును మృతుని సతీమణి ప్రమీలకు పోలీస్ అధికారులు అందజేసి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాయచోటి మండలం మాసాపేట రెడ్డివారిపల్లి గ్రామంలో మంగళవారం వెంకటేశ్వర్లు అంత్యక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఆర్ (టూ=) పోలీసు బృందం గాలిలోకి కాల్పులు జరిపి, అధికార లాంఛనాలతో మృతునికి 'గార్డ్ ఆఫ్ ఆనర్' (కడసారి గౌరవ వందనం) సమర్పించింది. ఈ అంతిమయాత్రలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## పీలేరు నియోజకవర్గంలో ఫుడ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు: గురుకుల పాఠశాలల్లో ఆహార నాణ్యత, గుడ్ల సరఫరాపై పరిశీలన



పీలేరు (జూలై 07): అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని పలు మండలాల్లో రాష్ట్ర ఫుడ్ కమిషనర్ జి. గంజిమ్మ దేవి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాయల్పాడు మండలంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలతో పాటు ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులకు రోజువారీ అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, మెనూ అమలు, గుడ్ల సరఫరా మరియు నిల్వ విధానాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల సందర్భంగా వంటశాలలో కొన్ని గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) నూనె ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్, సంబంధిత సిబ్బందిని వివరణ కోరారు. హాస్టల్‌కు సరఫరా అవుతున్న గుడ్ల నాణ్యత, బూజు పట్టిన లేదా చిన్నపాటి గుడ్లు వస్తున్నాయా అనే కోణంలో సరఫరా రికార్డులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించిన అధికారులు, నిరుత్సాహపరిచేలా ఉన్న విధి నిర్వహణపై అవసరమైన చోట సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో జిల్లా మార్కెటింగ్/సరఫరా అధికారులు డీఎం సుమతి, డీఎస్ఓ రెడ్డి చంద్రిక, మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) బాబు నాయక్, ఎస్సీ, ఎస్టీ జిల్లా కోఆర్డినేటర్ శైలజ, పద్మావతి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని నియోజకవర్గ సిబ్బందిని ఈ సందర్భంగా ఆదేశించారు.

## ఆసుపత్రి అభివృద్ధికి ఎంపీ నిధులు: సదుం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మోడల్ హాస్పిటల్‌గా తీర్చిదిద్దుతాం -- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



సదుం: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (వైద్యశాల) అన్ని వసతులతో కూడిన మోడల్ హాస్పిటల్‌గా తీర్చిదిద్దేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని రాజంపేట పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఇన్-పేషెంట్లు, అవుట్-పేషెంట్లకు అందుతున్న వైద్యసేవలు, మందుల లభ్యతపై రోగులను, సిబ్బందిని అడిగి ఆరా తీశారు. ఆసుపత్రి ప్రాంగణంలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న డయాలసిస్ కేంద్రం, పోస్టుమార్టం గదుల పనులను ఎంపీ మిథున్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. వీటి నిర్మాణ పనుల పూర్తికి, అలాగే ఆసుపత్రికి అవసరమైన ఫ్రీజర్ బాక్సుల కొనుగోలుకు తన ఎంపీ నిధుల నుండి రూ. 24 లక్షలు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి పంపాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డికి సూచించారు. ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం నిరంతరం అందుబాటులో ఉండాలంటే సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. ఈ క్రమంలోనే వైద్యశాలలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, పారామెడికల్ మరియు ఇతర సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఎంపీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పీలేరు నియోజకవర్గం బడుగుల మహనీయుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఘనంగా ఎంఆర్పిఎస్ 32 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



పీలేరు జులై 7: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన , ఎం ఆర్ పి ఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పీలేరు మండలం ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షులు గండికోట రెడ్డి కుమార్, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు ఇంగ్లే బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్, టిడిపి బీసీ నాయకులు కురబ సంఘం పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు వసంతల రాజా ముఖ్యఅతిథిగా హాజరై జండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు సందర్భంగా వారు మాట్లాడుతూ ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద వర్గాల మహనీయులు చిన్న పిల్లల గుండె జబ్బుల కోసం ఆరోగ్యశ్రీ ని సాధించినటువంటి ప్రాణదాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కన్న కలల స్వరాజ్యాన్ని అనునిత్యం ఈ దేశంలో పేద ప్రజలకు అందిస్తున్నటువంటి మహాత్ముడు మరో అభినవ అంబేద్కర్ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అని ఎం ఆర్ పి ఎస్ ఉద్యమం కేవలం మాదిగల కోసమే కాకుండా ఈ దేశంలోని అన్ని వర్గాల ప్రజల కోసం ఉద్యమించిన నాయకుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం కేక్ కట్ చేసి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో రేపుల బయలు గ్రామం టిడిపి నాయకులు నారాయణరెడ్డి, రమణారెడ్డి, యుగంధర్, బాబు, నిరంజన్, వెంకటరామిరెడ్డి, చంద్ర, రెడ్డప్ప రెడ్డి, వేపులపైలు గ్రామంలోని టిడిపి నాయకులు, ఎమ్మార్పీఎస్ పీలేరు నియోజకవర్గ యూత్ వంగళ్ల రాజేష్, నరసింహ సీనియర్ నాయకులు గండికోట హుస్సేనయ్య, రాచపల్లి వెంకటరమణ, మురళి, రాము, రాజా, పవన్, హరీష్, నరసింహులు, కృష్ణయ్య, గంగాధర్, ఏబీవీపీ మనోజ్, శశి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి కొత్త ఊపిరి! తిరుపతి కలెక్టర్‌కు ఘన సన్మానం



తిరుపతి జిల్లా కలెక్టర్‌గా మీ రాకతో జిల్లాలో సుపరిపాలనకు, ప్రజా సంక్షేమానికి ఒక కొత్త దిశ ఏర్పడింది. గత రెండు సంవత్సరాలుగా పారదర్శక పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో మీరు కనబరిచిన అంకితభావం జిల్లా ప్రజల మన్ననలతో పాటు అధికారుల ప్రశంసలను కూడా అందుకుంది. ఈ సందర్భంగా తిరుపతి మాజీ డిప్యూటీ మేయర్ ఆర్. సి. మునికృష్ణ , రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఆర్. పి. శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా మీ చాంబర్‌లో కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, శ్రీవారి ప్రసాదాలు అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ప్రజాసేవనే పరమావధిగా భావిస్తూ మీరు రాబోయే రోజుల్లో మరెన్నో విజయాలు సాధించాలని, మరింత ఉన్నత పదవులను అలంకరించాలని, శ్రీ వేంకటేశ్వర స్వామివారి అపార కృప మీపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

## తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఘన స్వాగతం



తిరుమల / రేణిగుంట: కలియుగ వైకుంఠం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ మంగళవారం రాత్రి రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ముంబై నుంచి ఇండిగో విమానంలో వచ్చిన ఆమెకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆమె రాక గురించిన సమాచారం తెలుసుకున్న అభిమానులు, సినీ ప్రియులు పెద్ద సంఖ్యలో ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. నిధి అగర్వాల్‌కు పుష్పగుచ్ఛాలు అందిస్తూ ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిమానులను చూసి ఆమె చిరునవ్వుతో అభివాదం చేస్తూ, కొద్దిసేపు వారితో కలిసి ఉత్సాహంగా ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం ఆమె విమానాశ్రయం నుండి రోడ్డు మార్గంలో తిరుమల కొండకు బయలుదేరి వెళ్లారు. ప్రముఖ హీరోయిన్ రాకతో రేణిగుంట విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో కాసేపు సందడి వాతావరణం నెలకొంది.

## సమన్వయ సహకారాలతో.. ముందుకెళదాం!

**-సమాచార పౌర సంబంధాల శాఖ జోన్ -4 నూతన ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్**




కడప, జూలై 7 : రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారాలు, సమాచారశాఖ, మీడియా సమిష్టి కృషితో.. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరవేసేందుకు పాటుపడదాం అని ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ కోరారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ఆర్జేడీ కార్యాలయంలో.. జిల్లాలోని మీడియా స్టాఫర్లు, సిబ్బందితో ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ ఆర్ కడప జిల్లాలో జోన్-4 కార్యాలయంలో ఆర్జెడీగా విధులు నిర్వర్తించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. జోన్-4 పరిధిలోని జిల్లాల్లో సమాచార శాఖ, మీడియా పబ్లికేషన్స్, ప్రసారాల ద్వారా విస్తృతమైన సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఈ జిల్లాల్లో అక్షరాస్యత, పేదరిక నిర్మూలన, వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల కార్యక్రమాలను, సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో మీడియా పాత్ర చాలా కీలకమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో మీడియా ప్రతినిధులు కర్తవ్య నిబద్ధతతో, పారదర్శకంగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చాలన్నారు. సమాచార శాఖను పటిష్టం చేయడంతో పాటు.. జోన్-4 పరిధిలోని జిల్లాల్లో పాత్రికేయులకు వృత్తి పరంగా సహాయసహకారాలు అందించడంలో ఎల్లపుడు ముందుంటామన్నారు. సమాచార శాఖ, పాత్రికేయుల మధ్య సత్సంబంధాలు కొనసాగినప్పుడే... ప్రభుత్వ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందగలవని, అందుకోసం అందరం సమిష్టిగా కృషి చేయాలని మీడియా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. అనంతరం పలువురు పాత్రికేయులు, సిబ్బంది ఆర్జేడీ కి పుష్ప గుచ్చాలు అందజేసి.. దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, సమాచార శాఖ ఎడి కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జూలై 8 నుంచి పీఎం విశ్వకర్మ రుణ అవుట్‌రీచ్ శిబిరాలు..!

కడప, జూలై 7: వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రధాన్ మంత్రి విశ్వకర్మ పథకం కింద గతంలో తిరస్కరణకు గురైన రుణ దరఖాస్తులను పునఃపరిశీలించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు జూలై 8 నుంచి 18 వరకు ప్రత్యేక రుణ అవుట్‌రీచ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) జి. జనార్దనం తెలిపారు. భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఈ అభివృద్ధి మరియు సౌకర్యాల కార్యాలయం, విశాఖపట్నం ఆధ్వర్యంలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం సహకారంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ వృత్తిదారులు, కళాకారులకు సకాలంలో బ్యాంకు రుణాలు అందించి స్వయం ఉపాధిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. శిబిరాలకు హాజరయ్యే పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ ఫోన్, పాన్ కార్డు (ఉన్నవారు), పీఎం విశ్వకర్మ ప్రాథమిక శిక్షణ పూర్తి చేసిన ధ్రువీకరణ పత్రం, దరఖాస్తులో పేర్కొన్న బ్యాంకు ఖాతా పాస్‌బుక్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. వైఎస్ఆర్ కడప జిల్లాలోని అర్హులైన సంప్రదాయ వృత్తిదారులు, కళాకారులు తమకు సమీపంలోని శిబిరానికి నిర్ణీత తేదీన హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్డిఎం విజ్ఞప్తి చేశారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ కట్ట పుట్టలమ్మ గుడి సమీపంలో సుమారు 45--50 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సంఘటనా స్థలంలో సగం తాగిన మద్యం సీసా లభించడంతో మద్యం సేవించిన అనంతరం డీహైడ్రేషన్ లేదా ఇతర సహజ కారణాలతో మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతదేహంపై ఎలాంటి బాహ్య గాయాలు లేవని తెలిపారు. ఎరుపు--నలుపు చెక్స్ షర్ట్ ధరించిన ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు, కుటుంబ సభ్యుల ఆచూకీ తెలిసిన వారు వెంటనే రేణిగుంట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# సమాజ భాగస్వామ్యంతోనే డెంగీ జ్వరాల నియంత్రణ: డాక్టర్ జులేఖ బేగం



వాయల్పాడు (జూలై 07): ప్రజల భాగస్వామ్యం మరియు సామాజిక స్పృహతోనే డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలను పూర్తిగా నియంత్రించగలమని చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రాఎజ) వైద్యాధికారి డాక్టర్ జులేఖ బేగం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ స్పష్టం చేశారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు మరియు ఆశా దినోత్సవం సందర్భంగా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు, వాటి పర్యవసానాలపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించి, ప్లకార్డులతో భారీ ర్యాలీ మరియు ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు వంటి ఐదు రకాల జ్వరాలు ప్రజారోగ్యానికి అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఇటీవలే ప్రభుత్వం మలేరియా వ్యాధిని 'నోటిఫైబుల్ డిసీజ్' గా గుర్తించిందని తెలిపారు. తీవ్రమైన జ్వరం, చలి, తలనొప్పి, విపరీతమైన నీరసం, వాంతులు, వికారం, కనుగుడ్లు పక్కకు తిప్పలేకపోవడం, శరీరంపై దద్దుర్లు రావడం, ప్లేట్‌లెట్స్ (రక్తకణాలు) సంఖ్య తగ్గిపోవడం మరియు కీళ్లనొప్పులు ఈ జ్వరాల ముఖ్య లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే రక్తపరీక్షలు చేయించుకుని, సకాలంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందితే ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా గర్భవతులు, బాలింతలు, పదేళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల పైబడిన వారిలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి వారు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న "చెక్, క్లీన్, క్లోజ్" అనే మూడు సూత్రాలను పాటిస్తూ, దోమలపై సాగించే దండయాత్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సూపర్‌వైజర్ బహుద్దీన్, ఆశా కార్యకర్తలు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సానుభూతి చాటిన మాజీ ఎమ్మెల్యే: చింతల రామచంద్రారెడ్డి



వాల్మీకిపురం (జూలై 07): పీలేరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి గారు మానవత్వాన్ని చాటుకున్నారు. వాల్మీకిపురం మండలం జర్రపల్లి గ్రామానికి చెందిన కురబ సామాజిక వర్గం నాయకుడు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ తరిగొండ నాగరాజ (50) అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మంగళవారం జర్రపల్లిలోని వారి నివాసానికి చేరుకున్నారు. నాగరాజ భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఆయన ఘన నివాళులర్పించారు. అనంతరం శోకసముద్రంలో మునిగిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కుటుంబానికి పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# చవటపల్లి రవీంద్రనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్.



లక్కిరెడ్డిపల్లి, జూలై 7: లక్కిరెడ్డిపల్లి మండలంలోని అనంతపురం గ్రామపంచాయతీ పరిధిలోని చవటపల్లి రవీంద్రనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సేవలు, హాజరు నమోదు, పోషకాహార పంపిణీ, మెనూ అమలు, రక్తహీనత (అనీమియా), తక్కువ బరువు ఉన్న చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారంతో పాటు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలని, కేంద్రంలో ఎల్లప్పుడూ పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. చిన్నారుల ఆరోగ్య స్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అనీమియా మరియు పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ క్రాంతి కుమార్, ఎంపీడీవో రెడ్డయ్య, ఆర్ ఐ రాజేష్ సంబంధిత అధికారులు, అంగన్వాడి సిబ్బంది, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్.



కె.వి.పల్లి, జూలై 6, రాజనీతి: కె.వి.పల్లి మండలం చెరువుముందరపల్లి గ్రామ సమీపంలోని మామిడి తోటలో అక్రమంగా పేకాట నిర్వహిస్తున్న వారిపై కె.వి.పల్లి పోలీసులు సోమవారం దాడి నిర్వహించారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.వెంకట శివకుమార్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.10,100 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, తొమ్మిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపారు. జూదం, పేకాట వంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ప్రజలు అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# పుట్టా కృష్ణారెడ్డి వర్ధంతి: పేదలకు అన్నదానం



పీలేరు: "పేదల ఆకలి తీర్చడమే నా తండ్రికి మేమిచ్చే నిజమైన నివాళి" అంటూ పుట్టా కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు పుట్టా రాజశేఖర్ రెడ్డి అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, తన తండ్రి జ్ఞాపకాలను సేవతో నిలుపుకున్నారు. పీలేరు మండలం కాకులారంపల్లికి చెందిన పుట్టా కృష్ణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని, పీలేరు పట్టణ మార్కెట్ యార్డ్ ఆవరణలోని అన్న క్యాంటీన్‌లో పేదలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పుట్టా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి పుట్టా కృష్ణారెడ్డి జీవితాంతం ప్రజాసేవనే ధ్యేయంగా బతికారని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా, సమాజంలో ఉన్న పేద ప్రజలకు సేవ చేయడమే తమ కుటుంబం ఆయనకు అర్పించే అసలైన అంజలి అని పేర్కొన్నారు. పుట్టా కృష్ణారెడ్డి అందరితో ఎంతో ఆప్యాయంగా, కలిసిమెలిసి ఉండే మంచి వ్యక్తిత్వం గల వారని గుర్తుచేసుకున్నారు. తండ్రి స్మృతిని పురస్కరించుకుని కుమారుడు రాజశేఖర్ రెడ్డి ఇలా అన్నదాన కార్యక్రమం ద్వారా ఆయన జ్ఞాపకాలను సజీవంగా ఉంచడం ఎంతో అభినందనీయమన్నారు. కృష్ణారెడ్డి గారికి పేదల పట్ల ఎంతో ఆదరణ, కరుణ ఉండేవని తెలిపారు. ఆయన స్మారకార్థం నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమం రాజశేఖర్ రెడ్డి గారి సామాజిక బాధ్యతకు ఒక చక్కని నిదర్శనమని కొనియాడారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ఎస్వీఎస్ఎస్ (రాయూరా) కృష్ణారెడ్డి, దేవులపల్లి చంద్రశేఖర్ రెడ్డి (ణజ=), ఖాజాతో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ (ఙఖూ) ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొని నివాళులర్పించారు.

## నెట్టిబండ కాలనీలో 50% ఎస్ఐఆర్ పూర్తి.. నల్లారి ఆదేశాలతో లక్ష్మీకర ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం



పీలేరు: పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పీలేరు మండలం యర్రగుంట్లపల్లి గ్రామం నెట్టిబండ కాలనీలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీకర ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీకర మాట్లాడుతూ.. నెట్టిబండ కాలనీలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఇప్పటికే 50 శాతం పూర్తయిందని వెల్లడించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ పక్కాగా జరగాలన్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచనల ప్రకారం, మిగిలిన పనిని కూడా నిర్దేశిత గడువులోపు 100 శాతం పూర్తి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గ్రామంలో మరణించిన వారి ఓట్లను నిబంధనల ప్రకారం ఓటరు జాబితా నుండి తొలగిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన కొత్త యువతీ యువకులకు మరియు ఇప్పటివరకు ఓటు లేని వారికి కొత్తగా ఓట్లను నమోదు చేస్తున్నామని వివరించారు. ప్రజలు తమ ప్రజాస్వామ్య హక్కును కాపాడుకునేందుకు, ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో ఒకసారి క్షుణ్ణంగా సరిచూసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో టీడీపి ముఖ్య నాయకులు దినచంద్రారెడ్డి, ప్రభాకర్ రాజు రెడ్డి, శేఖర్‌తో పాటు స్థానిక బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల ధర్నాను జయప్రదం చేయండి -- సీఐటీయూ అన్నమయ్య జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్



కలకడ, జూలై 7: జూలై 31న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించనున్న ఆశా కార్యకర్తల ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ అన్నమయ్య జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. ఆశా డే సందర్భంగా అన్నమయ్య జిల్లా కలకడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ పనిచేస్తున్న ఆశా కార్యకర్తలను కలిసి సీఐటీయూ రాష్ట్ర కమిటీ విడుదల చేసిన కరపత్రంలోని డిమాండ్లను వివరించారు. ఆశా కార్యకర్తల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఈ సందర్భంగా మండెం సుధీర్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలను అందించడంలో ఆశా కార్యకర్తలు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నారని అన్నారు. గర్భిణీల నమోదు, తల్లి-శిశు సంరక్షణ, సురక్షిత ప్రసవాలు, చిన్నారులకు టీకాలు, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నివారణ, పోషకాహార కార్యక్రమాల అమలు, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించడం వంటి అనేక కీలక బాధ్యతలను ఆశా కార్యకర్తలు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కరోనా మహమ్మారి సమయంలోనూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన ఆశా కార్యకర్తల సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఇంతటి బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి హక్కులు ఇప్పటికీ కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్యకర్తల సేవలను గుర్తించి వారికి గౌరవప్రదమైన జీవనం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది మార్చి 5న విజయవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆశా కార్యకర్తల మహాధర్నాకు ప్రభుత్వం స్పందించి సంఘాల నాయకులతో చర్చలు జరిపిందని గుర్తు చేశారు. ఆ చర్చల అనంతరం ప్రభుత్వం 'మినిట్స్ ఆఫ్ మీటింగ్' ప్రతిని సంఘాల ప్రతినిధులకు అందజేసి, పలు డిమాండ్లను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ఆ హామీలు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో ఆశా కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ విడుదల చేసిన కరపత్రంలో పేర్కొన్నట్లుగా ఆశా కార్యకర్తలకు నెలకు రూ.26,000 కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ, ప్రమాద బీమా, ప్రసూతి సెలవులు, ఉద్యోగ భద్రత, పెండింగ్ ప్రోత్సాహకాలను వెంటనే చెల్లించడం, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు ప్రోత్సాహకాలను అమలు చేయడం, పని భారాన్ని తగ్గించడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన హక్కులు కల్పించడం వంటి అన్ని న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం జూలై 31న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు మండెం సుధీర్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కూడా భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కలకడ మండలం నుండి ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ధర్నాను జయప్రదం చేయాలని, ఆశా కార్యకర్తల న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలకడ మండల వ్యాప్తంగా ఉన్న ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published & Owned by Smt.kakarla padmaja, Published at Do.No.3-267/5, Ragavendra Colony, Greemspeta, Chittoor Dist, Ap. and Printed at Prajasakthi Press, Renigunta road, Tirupati, Chittoor, A.P. Editor : N.Nagaraju, RNI No. APTEL/2013/49614